క్లుప్తంగా

తాగునీటి కొరత రావొద్దు


మాట్లాడుతున్న డీపీవో జగదీశ్వర్

శంకరపట్నం: వేసవిలో తాగునీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీపీవో జగదీశ్వర్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మిషన్‌భగీరథ నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఈఈ అంజన్‌రావు, డీఈ ఖాజావషీయొద్దీన్, ఏఈ విలాశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో ప్రజలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని జనతాదళ్ (సెక్యులర్)పార్టీ (జేడీఎస్)రాష్ట్ర కార్యదర్శి వాసు వద్లూరి అన్నారు. గురువారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి అప్పులు ఇచ్చేందుకు ఎవరు ముందుకు రావడంలేదని సీఎం ప్రకటన చేయడం ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సమయంలో దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు గట్టెకించిన విషయాన్ని గుర్తు చేశారు. అవసరమైతే ఆర్థిక నిపుణుల సలహాలు సూచనలు తీసుకోని సంక్షోభాన్ని అధిగమించాలని సూచించారు. ఆరు గ్యారంటీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అంగన్‌వాడీలు భాగం కావాలి


మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం విజయవంతానికి అంగన్‌వాడీలు భాగం కావాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తడి,పొడి చెత్త వేర్వేరుగా సేకరణ జరుగుతుందని, అంగన్‌వాడీ టీచర్లు పిల్లల తల్లిదండ్రులకు చెత్తపై అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీవో సుగుణ, సూపర్‌వైజర్ పద్మ, టీచర్లు జ్యోతిరాణి, పద్మ, సులోచన, జయ, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం

చొప్పదండి: మండలంలోని రాగంపేట వాయునందన పద్మశాలీ సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా ఉడుత రాజేశం, ఉపాధ్యక్షుడిగా అడిగొప్పుల సాయి, గౌరవ అధ్యక్షుడిగా ఎలిగేటి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ఎలిగేటి రాజు, కోశాధికారిగా అలిశెట్టి రంజిత్, కార్యవర్గ సభ్యులుగా ఎలిగేటి లక్ష్మీరాజం, అడిగొప్పుల శంకరయ్య, ఎలిగేటి తిరుపతి, రాజు, కనుకయ్య, సత్యనారాయణ, లక్ష్మి ఎన్నికయ్యారు.

మూడు వారాలపాటు సాగునీరందించాలి

వీణవంక: పంటలు చివరి దశలో ఉన్నందున మరో మూడు వారాల పాటు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని నీటిపారుదల అధికారులు కెనాల్ వెంబడి నిరంతరం పర్యవేక్షణ చేయాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ నాయకుడు పోలాడి రామారావు కోరారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్, శంకరపట్నం, వీణవంక,జమ్మికుంట మండలాల పరిధిలోని కాకతీయ కాలువ పరిధిలోని డీబీఎం 4 నుంచి డీబీఎం 9 ఉపకాలువల వెంట గురువారం రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. వీణవంకలో మాట్లాడుతూ కాలువల వెంట అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో చాలా మంది రైతుల పొలాలకు నీరు అందక పొట్ట దశలో ఉన్న పైరు ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారని రామారావు విచారం వ్యక్తం చేశారు. వీణవంక నుంచి జమ్ముకుంట వరకు గల చివరి ఆయకట్టు రైతాంగానికి నీరు సరిగా అందడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారని పరిశీలనలో తేలిందని, అధికారులు తక్షణమే కాలువల వెంట నిరంతర పర్యవేక్షణ చేయాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మరో 3 వారాల పాటు రైతాంగానికి నీళ్ళు అందించి చివరి ఆయకట్టు రైతులు పంటలను కాపాడాలని పోలాడి రామారావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు సర్వ సభ్య సమావేశం

చొప్పదండి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక సర్వ సభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నామని సీఈవో క్లెం తిరుపతిరెడ్డి తెలిపారు. సంఘం పర్సన్ ఇన్‌చార్జి ముమ్మాడి లక్ష్మణాచారి అధ్యక్షతన జరిగే సమావేశానికి సంఘ సభ్యులు తరలిరావాలని కోరారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర జమా ఖర్చుల ఆమోదం, వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ తీర్మానం ప్రవేశ పెట్టనున్నామన్నారు.

దుర్వాసన, పొగ భరించలేం!

- కొత్తపల్లి మున్సిపాలిటీ డంపింగ్‌యార్డును తరలించాలి
- రోగాల బారినపడుతున్నామని దేశరాజ్‌పల్లి గ్రామస్తుల ఆవేదన
- అధికారులకు విన్నవించినా స్పందన కరువు


దేశరాజ్‌పల్లి గ్రామ శివారులో డంపింగ్‌యార్డు

రామడుగు: కొత్తపల్లి మున్సిపాలిటీ డంపింగ్‌యార్డుతో దేశరాజ్‌పల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. డంపింగ్‌యార్డుతో ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గతంలో కాకతీయ కాలువ నిర్మాణ పనులకు మట్టి సేకరణకు దేశరాజ్‌పల్లి గ్రామ రైతుల నుంచి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఈభూముల నుంచి మట్టి సేకరించడంతో భారీ గుంతలు ఏర్పడి చాలా రోజుల వరకు పనికిరాకుండా మారాయి. కాగా భూములను దేశరాజ్‌పల్లికి కేటాయించాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ అధికారులు కేటాయించలేదు. మూడేళ్ల క్రితం దేశరాజ్‌పల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ భూములను కొత్తపల్లి మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు కోసం కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కొత్తపల్లి మున్సిపాలిటీ నుంచి వాహనాల ద్వారా సేకరించిన చెత్తాచెదారాన్ని గ్రామ శివారులోని డంపింగ్‌యార్డులో వేస్తున్నారు. డంపింగ్‌యార్డుకు జంతు కళేబరాలతో పాటు కుళ్లిన చెత్తను తీసుకువస్తుండటంతో భరించలేని దుర్వాసన వస్తోందని గ్రామ శివారులోని రైతులతో పాటు దళితకాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చెత్తకు నిప్పు పెట్టడంతో పొగతో ఊపిరిఆడటంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. డంపింగ్‌యార్డును తొలగించాలని గ్రామస్తులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటుగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.


కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం



డంపింగ్‌యార్డును వేరే చోటుకి తరలించాలి. డంపింగ్‌యార్డుతో గ్రామస్తులు నానా ఇబ్బందులుపడుతున్నా. యార్డును తరలించేలా చూడాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపాటు కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు విన్నవించాం.

– ఎల్కపల్లి లచ్చయ్య, దేశరాజ్‌పల్లి

డంపింగ్‌యార్డు తరలించాలి



డంపింగ్‌యార్డుకు చెత్తాచెదారంతో పాటు కుళ్లిన జంతు కళేబరాలు తీసుకువస్తున్నారు. దీంతో వాసన భరించలేకపోతున్నాం. యార్డు నుంచి వచ్చే పొగతో వ్యాధులబారినపడుతున్నాం. డంపింగ్‌యార్డును తరలించాలి.

– దొబ్బల కిరణ్‌కుమార్, దేశరాజ్‌పల్లి


మానకొండూర్: వన్నారంలో పోచమ్మ బోనాలు

ఘనంగా పోచమ్మ బోనాలు

మానకొండూర్: మండలంలోని వన్నారం, మానకొండూర్, ఖాదర్‌గూడెం గ్రామాలలో గ్రామస్తులు గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. డీజే, డప్పు చప్పళ్ల మధ్య బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పిల్లాపాపలు, పాడిపంటలను చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం ఆలయ ఈవో మారుతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదాయం రూ.1,05,925 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీలు గోపాల్‌రావు, గన్నెపల్లి శంకర్‌లింగం, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు ప్రభాకర్‌రెడ్డి, ఉమేశ్, గ్రామస్తులు బాపురావు, గోవిందమాంబ సేవా సమితి భక్తులు పాల్గొన్నారు.




మానకొండూర్‌లో ...


శంకరపట్నం: తాడికల్‌లో

విద్యార్థుల మాక్ పార్లమెంట్


మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులు

చొప్పదండి: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం బాల్ సంసద్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంగతాయారు ఆధ్వర్యంలో జరిగిన బాల్ సంసద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు పార్లమెంట్ సమావేశాల తరహాలో సమావేశం నిర్వహించారు. పాలక పక్ష నేత, ప్రతి పక్ష నేత, సభ్యులు, సెక్రటరీ సజనరల్, స్పీకర్ తదితర స్థానాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి విద్యార్థులతో పార్లమెంట్ సెషన్ నడిచే విధంగా మాట్లాడించారు. విద్యార్థులు సమర్థవంతంగా మాక్ పార్లమెంట్ నిర్వహించారని తహసీల్దార్ కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


బాల్ సంసాద్ పరిశీలిస్తున్న అధికారులు

అంగడి వేలం రూ.40,61,000

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో గురువారం పశువులు, వారసంత అంగడికి బహిరంగ వేలం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి 23 మంది డీడీలు అందించి వేలంలో పాల్గొన్నారు. పరుకాలకు చెందిన పొరండ్ల రమేశ్ వేలంలో రూ.40,61,000 అంగడి ఫీజు వసూలు దక్కించుకున్నారని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఆర్ఐ భాస్కర్, ఎస్ఐ సదానందం, జూనియర్ అకౌంటెంట్ అనిల్ పాల్గొన్నారు.

రంజాన్ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఈద్గా, ఖబ్రస్తాన్ పరిసరాలను శుభ్రం చేసే పనులను కమిషనర్ ఎండీ అయాజ్ పరిశీలించారు. ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు ఈద్గా, ఖబ్రస్తాన్ శుభ్రం చేయించి, రంగులు వేసి అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

దేశరాజ్‌పల్లి పల్లె దవాఖానాకు ఉత్తమ అవార్డు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి పల్లె దవాఖానా ఎన్‌క్వాస్ కింద నాణ్యతా సర్టిఫికెట్‌తో పాటు ఉత్తమ అవార్డుకు ఎంపికై నట్లు మండల వైద్యాధికారి రమేశ్ తెలిపారు. నేషనల్ సిస్టం రిసోర్స్ సెంటర్ ఎన్ క్వాస్ బృందం ప్రభుత్వ వైద్యశాలను మార్చి 1న తనిఖీ చేశారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 పల్లె దవాఖానాలకు ఎన్ క్వాస్ నాణ్యతా సర్టిఫికెట్‌తో పాటు ఉత్తమ అవార్డులు వచ్చాయని, దేశరాజ్‌పల్లి పల్లెదవాఖానా మంచి మార్కులతో ఉత్తమ అవార్డు దక్కించుకుందన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం


శంకరపట్నంలో మాట్లాడుతున్న సీడీపీవో


మాట్లాడుతున్న తహసీల్దార్ రాణి

శంకరపట్నం: బాలల హక్కులను కాపాడుదామని సీడీపీవో శ్రీమతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో బాలల హక్కులు, బాల్యవివాహాలు, బడీడు పిల్లలు, బాలకార్మికులు, పిల్లల రక్షణ, దత్తత, సంరక్షణ తదితర విషయాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ భాస్కర్, ఎంఈవో లక్ష్మీనారాయణ,వైద్యాధికారి శ్రావణ్, ఏపీఎం సుధాకర్, సూపర్‌వైజర్‌లు అరుణ, పద్మ, ఏఎస్సై సుధాకర్,అంగన్‌వాడీ టీచర్లు , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: బాలల పరిరక్షణ అందరి బాధ్యతని తహసీల్దార్ రాణి అన్నారు. గురువారం బాలల పరిరక్షణ విభాగం కరీంనగర్ ఆధ్వర్యంలో ఇల్లందకుంట రైతువేదికలో మండల బాలల పరిరక్షణ కమిటీ శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా, బాల కార్మికులను గుర్తించి చదువుకునే విధంగా తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలని, బాలికలపై లైగింక వేధింపులు జరుగకుండా గ్రామాలలో అవగాహన కల్పించాలన్నారు. బాలల సమస్యలకు సంబంధించి సమాచారం అందించడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 అందరికి తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ పుల్లయ్య, ఎంపీఓ రాజేశ్వర్‌రావు, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ జయప్రకాశ్, మండల వైద్యాధికారి తులసీదాస్, సోషల్ వెల్ఫేర్ ప్రవీణ్, వసంత, ఏపీఎం రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, రమేశ్, ఐలయ్య, అనసూయ, మౌనిక, సరిత, రామ్‌నారా సింహా చారి, అబ్దుల్ గని, పాస్టర్ మదనయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రామడుగు: మండల కేంద్రానికి చెందిన నీలం సాయిరాం జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసర వేణి లక్ష్మన్‌లు తెలిపారు. కరీంనగర్‌లోని ఢిల్లీ డిఫెన్స్ కాలేజీలో చదువుతున్న నీలం సాయిరాం బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాయిరాంను డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్, కాసార్ల ఆనంద్‌కుమార్, రమణారావు, ప్రభాకర్, మూల వెంకటేశ్ అభినందించారు.

తిమ్మాపూర్: ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే జూనియర్ జాతీయ స్థాయి జూడో పోటీలకు జిల్లాకు చెందిన ఎం.విక్రమ్‌కుమార్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లోని సలార్ ఈ మిలాద్ ఓవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 24న జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల జూడో పోటీల్లో వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి విక్రమ్ కుమార్ 100 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని జూడో సంఘ జిల్లా కన్వీనర్ దామోదర్ తెలిపారు. విక్రమ్ కుమార్‌ను జూడో సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.


తిమ్మాపూర్: విద్యార్థిని అభినందిస్తున్న దామోదర్

ప్రజాపాలన పేరుతో రాక్షస పాలన

గంగాధర: ధర్నా, నిరసనలు చేస్తామని ప్రకటించనప్పటికీ అక్రమంగా అరెస్టు చేశారని మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేఘరాజు, మాజీ సర్పంచులు నజీర్, మడ్లపల్లి గంగాధర్ తదితరులు విమర్శించారు. బిల్లుల కోసం అసెంబ్లీని ముట్టడిస్తారనే సమాచారంతో పలువురు బీఆర్ఎస్ మాజీ సర్పంచులను గురువారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం నుంచి నాలుగైదుసార్లు అరెస్టు చేశారని, ప్రజాపాలన ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ రాక్షస పాలన సాగిస్తున్నారని, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశాం బిల్లులు అడగటం నేరమా అని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో కనుకయ్య, కొంకటి శంకర్ తదితరులున్నారు.

హుజూరాబాద్: మండలంలోని సర్పంచులను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేశారు. రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులు చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా అరెస్ట్ చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ సర్కార్ పని చేస్తోందని ప్రజలు త్వరలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఆరుగ్యారంటీలు అమలు చేయకుండా ప్రజలను, పనులు చేసిన సర్పంచులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం తగిన మూల్యం చెల్లిస్తుందన్నారు. అరెస్టయినవారిలో పాకాల లక్ష్మారెడ్డి, నిరోషాకిరణ్, తిరుమల తిరుపతి తదితరులు ఉన్నారు.


హుజూరాబాద్: పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

గన్నేరువరం: సర్పంచుల రావాల్సిన పెండింగ్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తీగల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బకాయిలను చెల్లించాలని కోరుతూ చలో అసెంబ్లీముట్టడి సందర్భంగా ఆయా గ్రామాల మాజీ సర్పంచులను ముందస్తుగా గురువారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్త వార్తలు

● **పాదయాత్ర విజయవంతంచేయాలి**

ఇల్లందకుంట: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ పిలుపు మేరకు ఏప్రిల్ 2 నుంచి జరిగే రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్రీయ పాదయాత్ర విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పాదయాత్ర మండలస్థాయి సమావేశం నిర్వహించారు. బీజేపీ అవలంబిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను దేశమంతటా వివరించాలని, పాదయాత్ర ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రణవ్‌ను పార్టీ కార్యకర్తలు నిలదీశారు. పార్టీ సభ్యత్వం లేని వ్యక్తికి మండల అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారని సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ ప్రశ్నించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారిని గుర్తించి పదవులు ఇవ్వాలనికోరారు.

ఇల్లందకుంట: మండలంలోని ప్రతి గ్రామంలో గడపకుపాదయాత్ర చేపట్టనున్నట్లు ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు.

గంగాధర: జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్ పిలుపునిచ్చారు. మండలంలోని మధురానగర్ చౌరస్తా ప్రజాపాలన కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏడాదిపాటు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో పాదయాత్ర నిర్వహించనున్నామని, చొప్పదండి నియోజకవర్గంలో ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమయ్యే పాదయాత్రలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

● **తలంబ్రాలు పోస్టర్ ఆవిష్కరణ**

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గురువారం సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలు పోస్టర్‌ను జిల్లా మహిళా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఆవిష్కరించారు. తలంబ్రాల కోసం మహిళా సంఘాలతో బుకింగ్ చేయించారు. ఏటీఎం రామారావు, రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● **క్రికెట్ పోటీలు ప్రారంభం**

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గంగాధర ప్రీమియర్ లీగ్ సీజన్-5, ఎడ్ల రవి స్మారక క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. టోర్నమెంట్‌లో 9 జట్లు పోటీ పడుతున్నాయని, లీగ్ పోటీల్లో మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.20 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు మూడవ, నాలుగో బహుమతి రూ.ఐదువేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎడ్ల అనిల్, అనూస్, శ్రీహరి, విక్రమ్, హరీశ్, ప్రవీణ్, తిరుపతి, మహేశ్, సాయి, బిట్టు, హర్షరాజు పాల్గొన్నారు.

● **కొనుగోలు కేంద్రం ప్రారంభం**

సైదాపూర్: మండలంలోని ఎల్లంపల్లి, ఘనపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను గురువారం సైదాపూర్ ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్ ప్రారంభించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సుధాకర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కుమారస్వామి, ఎఫ్‌పీసీ సీఈవో రంజిత్, రైతులు పాల్గొన్నారు.

● **బహుమతులు అందజేత**

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల టాస్క్(తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ గురువారం ముగిసింది. ప్రిన్సిపల్ డా. రమేష్ మాట్లాడుతూ టాస్క్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులు శిక్షణ తో ప్రయోజనం పొందారని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రానున్న రోజుల్లో ఎక్కువ మంది టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. టాస్క్ మెంటర్ రాజేష్, టాస్క్ కోఆర్డినేటర్ ఉమాకిరణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు**

హుజూరాబాద్: సాంప్రదాయ విద్యా మూలాలతో దేశం స్వయం సమ్మిళిత అభివృద్ధి చెందుతుందని సాహితీవేత్త విశ్వశ్రీ డాక్టర్ వసంతకుమార్ వాసిలి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో వికసిత్ భారత్-2047 విద్యా విధానం, భారతీయ జ్ఞాన పరంపర ఏకీకరణ ఆవిష్కరణలు, వ్యవస్థాపకత అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభించారు. అర్థవంతమైన చర్చలు, విధానాల రూపకల్పనకు కావాల్సిన సాహిత్యాన్ని, సమాజానికి, పాలకులకు దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు రామకృష్ణ, ఇందిరాదేవి, కోత్తిరెడ్డి మాల్లారెడ్డి, గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి, సాహివేత్తలు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

హుజూరాబాద్: పట్టణంలోని ఓ బంగారు షాపులో జరిగిన చోరీ కేసులో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ గురువారం తెలిపారు. పట్టణంలోని పాత సూపర్‌బజార్‌లో ఓ బంగారం షాపులో గుర్తు తెలియని మహిళలు వెండిపట్టగొలుసు చోరీ చేశారు. షాపులోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా నిందితులను గమనించి హుజూరాబాద్ బస్టాండ్ వద్ద గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకొని బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. వ్యాపారులు దుకాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు.

కులం పేరుతో దూషించినవారిపై కేసు

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామంలో కులం పేరుతో దూషించిన భార్యాభర్తలపై కేసు నమోదు చేశామని ఎస్సై రవి తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో దంపతులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.